కథ

# మనస్సాక్షి


కె.కె. రఘునందన

''మీరెప్పుడయినా సాని వీధి వెళ్ళారా?'' హఠాత్తుగా అడిగింది సుష్మ.

అటువంటి ప్రశ్నను ఊహించని బాలు ఉలిక్కిపడ్డాడు.

శుభమాని దంపతులు ఒకరికొకరు సమస్తమూ మనస్ఫూర్తిగా అర్పించుకునే శుభ క్షణంలో ఓ భార్య తన చెంతకు వచ్చిన భర్తను... అడిగిన ప్రశ్న...

'సుష్మ-బాలు'లది సంప్రదాయబద్ధమైన వివాహం... రెండువైపుల వారికీ సంపూర్ణంగా నచ్చిన సంబంధం... ఏవేవో కారణాల వల్ల శోభనం మాత్రం రెండుసార్లు వాయిదా పడింది.



ముచ్చటగా మూడోసారి మాత్రం ఎటువంటి అవరోధాలు లేకుండా ముహూర్తం ఖాయ మైంది. శోభాయమానంగా తయారుచేసిన పడకటింటి లోకి ఆలుమగలైన సుష్మ, బాలులను పంపి తలుపులు బిడాయించారు.

పూల పానుపుపై చేరిన తొలి క్షణమే సుష్మ నోటి వెంట వెలువడిన ప్రశ్న... అది...

ఎవరూ అడగరాని మాట... ఎదురుచూడని ప్రశ్న. అదీ తనువులు పంచు కునే సుమధుర మైన వేళలో బయటపడ్డంతో బాలు మనసంతా కకావికలైంది.

''ఈ కమ్మని రేయి అడగాల్సింది ఇదా సుష్మా!'' చనువు ప్రదర్శిస్తూ దగ్గరగా వెళ్ళి అడిగాడు బాలు.

''దూరం.. దూరం... నన్ను ముట్టుకోవద్దు... నేనీ ప్రశ్నను ఈ తొలిరేయి అడగాలనే అడిగాను... మీ నుండి జవాబు నాక్కావాలి...'' సూటిగా అంది సుష్మ.

''పాలు చల్లారిపోతున్నాయి... స్వీట్లు ఊరిస్తున్నాయి. మరి నువ్వు కూడా నన్ను...'' సుష్మను చేతుల్లోకి తీసుకోబోయే సరికి ఒడుపుగా తప్పించుకున్నది.

అలా జరుగుతుందని బాలు ఊహించలేదు. అతన్ని నిరాశ చుట్టేసింది. ''చెప్పండి సాని వీధి వెళ్ళారాలేదా!'' ఈసారి ఆమె కంఠంలో కొద్దిగా నిలదీసిన భావం బహిర్గత మయింది.

''సుష్మా! మనిద్దరినీ ఈ గదిలో ఏకాంతంగా బంధించటం... తెల్లారేదాకా అద్భుతమైన అనుభవాలు పంచుకోమని... కమ్మని ఊసులాడుకోమని'' అని చెప్పాడు.

కాని, సుష్మలో ఎటువంటి స్పందన లేదు.

పెదవులపై విరబూసిన దరహాస చంద్రికలతో తనను స్వర్గలోకంలోకి ఆహ్వానిస్తుందని...

అలవోకగా జార్చిన పైటతో కనిపించి 'నన్ను మీ సందిట బంధించరూ!!' అంటూ సాక్షాత్కరిస్తుందని..

తన చేతి వేళ్ళకి చిలకలు చుట్టి నోటికి అందిస్తుంటే తనామె వేళ్ళని చిలిపిగా కొరికితే ఆమె చిరు కేకలు వేసి తనని వెనక్కి తోసి తన ఎద మీద పడి ఉక్కిరిబిక్కిరి చేస్తుందని... తీయని ఆశలతో ఎదురు చూశాడు.

కాని పడక మీదకి చేరీ చేరగానే ఆ ప్రశ్న సంధించటంతో సందిగ్ధంలో కొట్టుకులాడాడు.

శుభ ముహూర్తం పేరుతో ఒంటిగంట దాటింది. మిగతాకాలం ఈ విధంగా వృధా అవుతోంది.

''సుష్మా! నువ్వు వేసిన ప్రశ్న నన్ను పరీక్షించటానికో, నా మీద నమ్మకం లేనందుకో వేసినట్లు కనిపిస్తుంది... ప్లీజ్! ఈ తొలిరేయిని ఈ విధంగా చేయకు...'' కొద్దిగా ముందుకు జరిగి అన్నాడు బాలు...

''నేనడిగిన ప్రశ్నకు మీరీక్షణమే కాదు. రేపు, ఎల్లుండి లోగా జవాబీయవచ్చు! నాకు మీ దగ్గర్నుండి వచ్చే జవాబు సంతృప్తిని ఇవ్వాలి. అప్పుడు నాకు నేనుగా మీలో ఐక్యం అయిపోతాను. అంతవరకూ నన్ను ముట్టుకోడానికి

సాహసించి అభాసుపాలు కావద్దు...'' అనేసి అటు తిరిగి పడుకుండి పోయింది సుష్మ.

పడకల ఎడమలు తప్పలేదా రాత్రి...

***

''తొలి రాత్రి వేళ నువ్వలా మీ శ్రీవారి వ్యక్తిత్వం మీద దెబ్బకొట్టేలా ప్రశ్నించటం ఎంత మాత్రం సబబుగా లేదే సుష్మా..'' మిత్రురాలు భామిని నిష్కర్షగా అనేసింది.

''లేదే! ఆ ప్రశ్న అడగాల్సిందే. అదీ తొలి రాత్రే అడగాలనుకున్నాను అడిగేసాను. ఆయన ఇచ్చే సమాధానం నాకు సంతృప్తినివ్వాలి. అప్పటిదాకా మా పడకలు దూరమే!'' ఖచ్చితంగా చెప్పేసింది సుష్మ.

''నీకేమైనా పిచ్చా. కాబోయే భర్తపై నీలో చెడు భావం ఉంటే పెళ్ళికి ముందే అడిగి తేల్చుకోవాలి... వ్యసనపరుడని తెలిసిందనుకో.. పెళ్ళే మానేయాలి..'' దెబ్బలాడింది భామిని.

''నేను ఇప్పుడే ఎందుకా ప్రశ్న వేయాల్సి వచ్చిందో తరువాత చెబుతాను'' ధీమాగా అంది సుష్మ.

''చాలా బాగుందే నీ వ్యవహారం. సాని వీధికి వెళ్ళటానికి నేనేం రంకు వాడినా అని నిలదీయవచ్చు... లేదా నా ఇష్టం నేను మగాడ్ని... వెళ్తే నువ్వేం చేస్తావూ అని మొండిగా అంటే... అప్పుడు మీ ఇద్దరి మధ్య తగవు చిలికి చిలికి గాలివానగా మారుతుంది. పెద్దల దాకా పోతుంది. అమ్మాయికి అంత పొగరాని అందరూ యుద్ధానికి దిగుతారు'' అని మిత్రురాలిని హెచ్చరించింది భామిని.

''చూడు భామినీ! ఇప్పటి నా ప్రవర్తన నీకు చిత్రంగా ఉంటుంది. కాని తర్వాత నువ్వే మెచ్చుకుంటావు...'' తనలో భయభీతులు ఏమాత్రం లేనట్లుగా మాట్లాడటంతో భామిని నోరు నొక్కుకుంది.

''తొలి రాత్రి అనుభవాలు వినిపిస్తావనుకున్నాను. కానీ ఇలా కోరి సమస్యను కొని తెచ్చుకుంటున్నావు...'' విచారం వ్యక్త పరచింది భామిని.

ఎవరో పిలవగా వెళ్ళిపోయింది సుష్మ.

***

తొలిరేయి ఆలు మగలు మాట్లాడుకునే విషయాలు అనేకరకాలుగా ఉంటాయి. మనసు విప్పి మాట్లాడుకున్నప్పటికీ - ''మీరెవరినైనా 'లవ్' చేశారా? మీ మనస్సులో వేరెవరైనా ఉన్నారా? నన్ను మీరు పూర్తిగా ఇష్టపడే వివాహం చేసుకున్నారా'' ఇటువంటివే ఉంటాయి.

ఒక వేళ గత కాలపు ప్రేమ విషయాలు చర్చించుకున్నప్పటికీ తేలిగ్గా తీసుకొని, ఆ రాత్రంతా మధురంగా గడుపుతారని పుస్తకాల్లో చదివాడు బాలు..

కాని, వీటన్నింటికీ అతీతమైన ప్రశ్న - ''మీరెప్పుడైనా సాని వీధికి వెళ్ళారా?'' అన్నది.

నిజానికి సుష్మ అడిగిన ప్రశ్న బాలు గుండెలను సూటిగా తాకింది. గతాన్ని తట్టి లేపింది.

ఔను... ఆ రోజులు... తను బియిడి చేసే రోజుల్లో... విజయనగరంలో గది అద్దెకు తీసుకుని ఉండక తప్పింది కాదు... మిత్రులందరిలో బాపిరాజు బాలుకు సన్నిహితుడు.

రోజూ తన రూమ్ నుండి కాలేజీకి వెళ్ళాలంటే సాని వీధిలోంచి వెళ్ళాల్సి వచ్చేది. విజయనగరంలో సాని వీధికి ప్రత్యేకత ఉంది. కాలేజీ నుంచి తిరిగి వచ్చే సరికి చీకటి పడి పోయేది.

''చూడు గురూ! గుమ్మాల్లో అందమైన అమ్మాయిలు... చీకట్లో నక్షత్రాల్లా ఎలా మెరిసి పోతున్నారో...'' అని బాలును ఒత్తిడి చేసేవాడు.

చూడాలని కాకున్నా బాలు కళ్ళు చూడక తప్పేది కాదు. జడల నిండా విరజాజులు తురుముకుని పూల వాసనలు విరజిమ్ముతూ అలవోకగా నవ్వుతూ ఆహ్వానించే వారు. గాజుల గలగలలు చెవులకు గమ్మత్తుగా ధ్వనించేవి.

''రండి బాబు! రండి....'' అంటూ చిలిపిగా పిలిచేవారు.

''ఒకసారి వెళ్ళి వద్దాం గురూ... పద'' భుజం మీద నొక్కుతూ అన్నాడు బాపిరాజు.


''ఛీ! వద్దురా. నాకిటువంటివి పడదు - మనం వచ్చింది చదువుకోటానికి - వెధవ అలవాట్లు నేర్చుకోవటానికి కాదు'' అని సుతరామూ అంగీకరించలేదు బాలు.

''నీ ధర్మ పన్నాలు కట్టిపెట్టోయ్... మనమింకా డిగ్రీలు వెలగబెడ్తున్నాం. ఉద్యోగాలు వస్తాయో చస్తాయో తెలీదు... మనకు పెళ్ళయ్యేసరికి ఇంకా పదేళ్ళు పట్టేట్లుంది. మరి అంతదాకా ఏ అమ్మడినీ ముట్టుకోకుండా మడిగట్టుకు కూచోడమేనా! మన కాలేజీ కుర్రాళ్ళంతా ఈ సానివీధిని ఏల్తున్న వాళ్ళే..'' అని బోధించాడు బాపిరాజు.

''అడుసు తొక్కనేల కాలు కడగనేల అన్నారు పెద్దలు... నాకే మాత్రం నచ్చదు'' కచ్చితంగా అనేసాడు బాలు...

''ఒరే ఆడంగీ నీకంతా పాత చింతకాయ పచ్చడి భావాలే... నాతో చేయి కలిపావంటే స్వర్గాలు చూపిస్తా...'' మహోత్సాహంతో అన్నాడు బాపిరాజు.

కాని బాలు చలించలేదు. అయితే బాలు వాళ్ళు ఉండే రూమ్ అకస్మాత్తుగా మారాల్సి వచ్చింది.



మరెక్కడా రూమ్ దొరక్క చివరికి, సానివీధి చివరగా దొరికింది.

ఓ రోజు బాలు ఒక్కడే గదిలో రికార్డు వర్కు చేసుకుంటున్నాడు. పక్క గదిలోంచి ఏవో మూలుగులు సన్నగా వినిపిస్తున్నాయి. లేచి వెళ్ళి గది తలుపు సన్నని చీలిక నుంచి చూశాడు.

అంతే.. ఒక్కసారిగా గుండెలు తీవ్రంగా స్పందించాయి.

ఒక ఆడ – మగ కలిసి ఆత్రంగా చుట్టుకుపోతున్నారు. ఆమె అతని వీపు మీద చేతులుంచి బలంగా హత్తుకుపోతున్నది. అతను వీరావేశంతో ఊగిపోతున్నాడు. ఆమె చెప్పలేని తమకంతో తీయగా మూలుగుతున్నది.

బాలు ఉత్కంఠగా చూస్తున్నాడు... జీవితంలో ఆడమగల కలయికను కనులారా గాంచటం యిదే తొలిసారి.

వీధిలో తలుపు చప్పుడవటంతో గబాలున వెళ్ళి తెరిచాడు బాలు. బాపిరాజును చూడగానే కంగారు పడ్డాడు.

''ఏరా! ఆ చెమట్లేమిట్రా... రోజులా లేవు నవ్వు. నీ మొహంలో రక్తం పాకుతోంది... చెప్పు ఏం చేశావో...'' నిలదీశాడు బాపిరాజు.

''అబ్బే! ఏం లేదురా. ఏం లేదు'' తడబడ్డాడు బాలు..

''ఏం లేదంటున్నావు గాని... ఏదో ఉంది... కొంపదీసి టట్టడాం గాని కుదిరిందా'' చేయిని మృదువుగా నొక్కి అడిగాడు.

''ఛీ! అటువంటిదేం లేదు కాని'' అని పక్క గదిలోకి చూపిస్తూ చెప్పాడు.

ఆదుర్దాగా కంతలోంచి చూశాడు బాపిరాజు.

కానీ ఆసరికే ఆడమగ బట్టలు కట్టేస్కున్నారు.

''నువ్వు లక్కీ ఫెలోవిరా... నువ్వంతా చూసావు... నాకే దక్కలేదా భాగ్యం!! చూస్తేనే ఇంత టెన్షన్‌కి గురైనావే! మరి అదే... నిజంగా నీకెంత మజానో తెలుసా!'' అని మరింత ప్రోత్సాహంగా మాట్లాడాడు బాపిరాజు.

తను అనవసరంగా నిగ్రహం కోల్పోయి బంగారు జీవితాన్ని పక్కదారులు పట్టిస్తున్నానేమో ననుకుని తెగ నలిగిపోయాడు బాలు.

అయితే బాపిరాజు ఊరుకోలేదు. పార్టీ పేరుతో తనే డబ్బు పెట్టుకుంటానన్నాడు.

''అది కాదురా రాజా! నాకటువంటి వంటే విపరీతమైన భయం... దయచేసి నన్నొదిలి పెట్టు..'' బ్రతిమిలాడాడు బాలు.

''అయితే ఓ రిక్వెస్టు. నువ్వేం చేయొద్దు... నాకా అనుభవం కావాలి. కాబట్టి నేను వెళ తాను. నువ్వు నాకు తోడుంటే చాలు'' అని ప్రోద్బలం చేశాడు బాపిరాజు.

మిత్రుడి ఒత్తిడికి తట్టుకోలేక పోయాడు బాలు... కేవలం తోడుగా మాత్రమే రమ్మన్న అతని కోరికను కాదనలేక పోయాడు.

ఆ సాయంత్రమే బాపిరాజు టింగురంగుడిలా తయారయ్యాడు. సెంటు ఘుమఘుమలు శరీరానికి ఒంట బట్టాయి.

సానివీధిలో హడావుడి మొదలైంది. మందు బాబుల జాతరతో రణగొణధ్వనిలా మారింది. అసలుసిసలు శృంగారమంతా గుమ్మంలో నిలుచున్న నెరజాణల్లో ఒదిగినట్లు అనిపిస్తూంది.

ఓ రిక్షా వాడొచ్చాడు. అప్పారావు కంపెనీలో జున్ను ముక్కల్లాంటి అమ్మాయిలున్నారని చెప్పి తీసుకెళ్ళాడు. తను కేవలం తోడుగా ఉన్నా సరే బాలు గుండెంతా గుబులుతో నిండిపోయింది.

కంపెనీలోకి వెళ్ళి వెళ్ళంగానే ఆరుగురు అమ్మాయిలు వరుసగా వచ్చి నిల్చున్నారు. ఒకరిని మించి ఒకరు తమ అందాలను ఒలకబోసారు. వెన్నెల కుప్పలా ఉన్న ఓ అమ్మాయిని ఎంచుకుని, ఆమె భుజం మీద చేయివేసి తీసుకెళుతూ 'ఒరే బాలూ నువ్వు ఆ సైడ్ రూమ్‌లో కూచో' అన్నాడు.

''ఏం బాబు! తమరెల్లరా... బొంబాయి పిల్లున్నాది. ఓ సారి రుచి సూత్తే మరొగ్గరు... పిలవనా..'' అని కారాకిళ్ళీ నములుతున్న ఒసరమ్మ అనగానే బాలు కాళ్ళు లటలట లాడాయి.

భయంగా మొహం పెట్టి గదిలోకి నడిచాడు.

ఎవరెవరో వస్తున్నారు. అమ్మాయిలతో గదుల్లోకి పోతున్నారు. ముళ్ళమీద కూచున్నట్లుగా ఉంది బాలుకి.

అక్కడి నుండి త్వరగా బయట పడాలనిపించింది.

అదే సమయంలోనే గట్టిగా విజిల్స్ వినిపించాయి. తలుపుమీద లాఠీ తాటింపు అయింది. అంతే ఎక్కడి వారక్కడ పరుగులెత్తారు.

ఓ అమ్మాయి కేవలం లంగా బ్రాతోనే పరుగెత్తుకొచ్చి బాలు కూచున్న గదిలోకి వచ్చి లైటార్పేసింది.

బాలు గుండె ఆగిపోయింది. 'నన్ను....' అనికూ ఏదో అనబోతుంటే 'ష్!' అని బాలును మాటాడనీయకుండా అరచేత్తో నోరు మూసేసింది. ఆమె ఎద ఎత్తులు బాలు మొహానికి ఆనాయి. లేవబోతే భుజాన్ని అణిచేసి కూచోబెట్టింది.

''ఉండవయ్యా! మగడా! పోలీసులు రైడ్ చేస్తున్నారు. కాస్సేపిలా ఉంటే వెళ్ళిపోతారు'' అనగానే కుక్కిన పేనల్లే ఉండి పోయాడు బాలు...

తన ఖర్మకాలి పోలీసులకి దొరికిపోతే!? ఆ ఊహతో వణికిపోయాడు.

పోలీసుల బూట్ల చప్పుడు... గుండెల మీద నడిచినంత భయపెట్టాయి. తలుపు మీద లాఠీ... ఆ అమ్మాయి బాలును తోసుకుంటూ పరిగెత్తింది. బాలు భయంతో కంగారుగా పరిగెత్తి గోడగెంతాడు. మోచేయి చెక్కుకు పోయింది. అంబటి సత్రం దాకా పరిగెత్తి ఆగి అలుపు తీర్చుకునే దాకా గుండె తెరిపిన పడలేదు.

తరువాత బాపిరాజు కనిపించాడు. తను వేరే చోటికి అమ్మాయితో పారిపోయి కులాసా చేశానన్నాడు.

ఆ సంఘటనతో సాని వీధంటేనే పరమ భీతి పట్టుకుంది.

ఆరోజు మొదలు అటువంటి ఆలోచనలకే స్వస్తి పలికాడు బాలు.

***

సుష్మ అడిగిన ప్రశ్నకు తన గతమే ఓ జవాబు. కానీ తను ఇదంతా చెబితే సాని కొంపకు వెళ్ళి వాళ్ళతో సరస సల్లాపాలు ఆడకుండా ఉంటారాని ఎదురు ప్రశ్నిస్తుంది....

అసలు సానివీధి మొహమే తనకు తెలియదని కొట్టి పారేస్తే... ఔను అదే చేయాలి. సరస వేదికగా మారిన శోభనం రాత్రులను సాని వాళ్ళమీద చర్చించటానికా అని నిలదీయాలి.


అయితే తను చెప్పే ఈ జవాబులో ఎంత మాత్రం నిజం లేదు. ఆమె హృదయానికి సంతృప్తి నీయకపోవచ్చు. నిజంలేని తన వాదనను కనిపెట్టేస్తే.... అప్పుడు పడకల దూరమే!

ముందు నుయ్యి ... వెనుక గొయ్యి...

నిజం చెప్పాలా! అబద్ధం చెప్పాలా? ఏది చెబితే ఆమె మనసుకి సంతృప్తి...!!

శోభనం రెండవ రోజున కూడా అదే గంభీరమైన నిశ్శబ్దం అలుముకున్నది.

ఆలోచనల్లోంచి తేరుకున్నాడు బాలు... సుష్మ నిశ్శబ్దాన్ని ఛేదించింది... ''ఏమండీ! నిన్న నేనడిగిన



ప్రశ్నకు జవాబిస్తున్నారా! మీరిచ్చే జవాబు నాకు నచ్చితే మిమ్మల్ని ఈ పానుపు పైకి ఆహ్వానిస్తాను...''

''అది కాదు సుష్మా! నువ్వు అడిగిన ఆ ప్రశ్న...'' అని తడుముకోసాగాడు బాలు..

''ఓహో... నేనడిగిన ప్రశ్న మరచిపోయారా... అయితే వినండి..'' అని మరల అడగ్గానే మరోసారి గుండె గతుక్కుమంది బాలుకు.

నిజం చెబుతారో, అబద్ధం చెబుతారో నే చూస్తాగా... అంతదాకా నేను వదల్ను అన్నట్టుగా ఉంది సుష్మ వైఖరి.

ప్రస్తుతం తన శృంగార క్రీడలకి ఆయువు పట్టు ఆమె చేతుల్లో ఉంది. 'లేదు' అని కొట్టిపారేసి జబర్దస్తీగా ఆమెమీదకి దూకేసి ఎడాపెడా ముద్దుల్తో ముంచెత్తి, ఆనక ఆక్ర మించేస్తే...?! కాని... అలా చేస్తే అది మానభంగం అనిపించుకుంటుంది తప్ప మధుర బంధం కాదు.

అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్యను మృదువుగా పెనవేసుకోవాలంటే..?! ప్రస్తుతం ఆమె అడిగిన ప్రశ్నకు నిక్కచ్చిగా జవాబీయాలి. అలా చేసినా కూడా ఎదురయ్యే ఇబ్బందులు లేక పోలేదు. తన వ్యక్తిత్వాన్ని అనుమానించవచ్చు.

బాలు నుండి ఎటువంటి సమాధానం రాకపోవటంతో నిశ్శబ్దమే చివరిదాకా రాజ్యం చేసింది.

బాలుకి కళ్ళు వాలిపోయాయి. నేల మీదనే వాలి పోయాడు. అతని అవస్థను చూసి ముసిముసిగా నవ్వుకుంది సుష్మ.

***

''ఈ మూడవ రోజు కూడా ఏ ముచ్చట లేకుండా మొండిగా ప్రవర్తించి మీ శ్రీవారిని ఇబ్బంది పెట్టకు'' గదిలోకి వెళ్ళబోతున్న సుష్మను ఆపి చెప్పింది భామిని.

''ఈ రోజే కీలకం... ఆయనగారిచ్చే జవాబు నన్ను స్పందింప చేయాలి... అప్పుడే ఏ ముద్దు ముచ్చటయినా...!'' తన ధోరణిలోనే చెప్పింది సుష్మ!

''నిన్నవరూ మార్చలేరే!... అయితే ఓ విషయం... తెగేదాకా లాగద్దు...'' అంది నెమ్మదిగా భామిని. నవ్వి వెళ్ళి పోయింది సుష్మ.

లోనికి అడుగు పెట్టేసరికి బాలు మంచం ఒడ్డున కూర్చున్నాడు.

''ఏమండీ బాలుగారూ! ఈరోజు మీరు నా ప్రశ్నకు జవాబీయడానికి సిద్ధంగా ఉన్నారా... లేక మరల ప్రశ్న మరిచారా!'' అన్నది సుష్మ.

జీవితాంతం కలిసి ఉండాల్సిన తాను ఈరోజు చిన్నపాటి అబద్ధం చెప్పి తప్పించు కోవటం అవివేకమే అవుతుంది. అయినా తనేమీ తప్పు చేయలేదు. అది యవ్వనపు తొలి రోజుల్లో జీవితం మీద స్పష్టమైన అవగాహన లేని దశలో జరిగిన అనుభవం.

ఆ అనుభవమే తను చెప్పాలి. నిజాయితీతో కూడిన తన జవాబు ఆమెకు తృప్తి నిచ్చినా... ఇవ్వకపోయినా అవసరం. చెప్పటమే ముఖ్యం.

''సుష్మా! నువ్వడిగిన ప్రశ్నకు నేను జవాబిస్తున్నాను. విను... నేను విజయనగరంలో చదువుకునే రోజుల్లో ఎదురైన అనుభవం. మిత్రుల ప్రోత్సాహంతో ఓ సారి సాని వీధిలో ఓ ఇంటికి వెళ్ళిన మాట నిజం. కానీ... కానీ...'' ఆగాడు బాలు.

''అదిగో... ఆ నాన్చుడు నాకు నచ్చదు. చెప్పండి.. నా దగ్గర ఎటువంటి దాపరికం ఉండ కూడదు. మీరు చెప్పేది వాస్తవమో! అవాస్తవమో పసిగట్టగల్ను... అది బాగా గుర్తుంచుకోండి'' భర్త వంక సూటిగా చూస్తూ అన్నది సుష్మ.

మిత్రుడు బాపిరాజు ప్రోద్బలంతో సాని వీధిలో ఓ ఇంటికి వెళ్ళిన వైనం... పోలీసులు రైడింగ్ వల్ల తను పడ్డ అగచాట్లు అన్నీ పూస గుచ్చినట్లు వివరించాడు బాలు.

***

''ఆహా! ఓహో మీ అపూర్వమైన కట్టు కథ అద్భుతంగా ఉందండీ... సానింటికి వెళ్ళిన ఏ మగాడు కులకకుండా తిరిగి వచ్చాడంటే నమ్మే వెర్రిదాన్ని కాదండీ... నన్ను నమ్మించాలనేగా మీ ప్రయత్నం.... నేను వెళ్ళ లేదు అని మొండిగా ప్రవరిస్తే నమ్ముతుందో లేదోనని ఇలా అడ్డదారిన వచ్చారన్నమాట...''

''సుష్మా! నేను చెప్పింది...'' నెత్తి పట్టుకున్నాడు బాలు. అతని నిస్పృహను ఆమె గమనించింది.

''నేనలా ఎక్కడ అంటానో అని మీరు కంగారు పడ్తున్నారు కదూ!... కానీ మీకా భయం వద్దు... మీరు చెప్పిందంతా నిజమే!'' అని బాలును తన మీదకు లాక్కుంది. ముద్దులు పెట్టేసింది.

''సుష్మా! నీకేమైంది... నేను నిజం చెప్పినా నువ్వెక్కడ నన్ను అపార్థం చేసు కుంటావో నని, మన మధ్య దూరం మరింత పెరుగుతుందేమోనని ఎంత గింజుకు లాడానో తెలుసా!!'' ఆమెను అల్లుకు పోడానికి ప్రయత్నించాడు.

లేదండీ...! ''నేనటువంటి చోటికి ఏనాడూ వెళ్ళనే లేదని'' ఎక్కడ మీరు అబద్ధం చెప్పి నా మనసుని నొప్పిస్తారోనని అనుకున్నాను''

''అదేంటి? భర్త అలాంటి వాటి జోలికి వెళ్ళలేదని చెబితే నీకు ఆనందం కలగాలి కదా!'' సందేహంగా చూసాడు బాలు.

''మనస్సాక్షిని వంచించి, మభ్యపెట్టాలని చూడ్డాన్ని నేను హర్షించను. కారణం మీ మనస్సాక్షి నా దగ్గరున్నది కాబట్టి...''

''సుష్మా నువ్వనేదేంటో నాకర్థం కావడం లేదు. నా మనస్సాక్షి నీ దగ్గరా..'' వింతగా అడిగాడు బాలు..

''ఔనండీ! ఇదిగో మీ మనస్సాక్షికి ప్రతిరూపం....'' అంటూ పరుపు క్రింద నుంచి ఎర్ర రంగు డైరీ తీసింది.

''అది నీ చేతిలోకి ఎలా? '' డైరీని తన చేతిలోకి తీసుకుని గబగబ పేజీలు తిప్పాడు బాలు.

''మన పెళ్ళి ఖాయమైనాక నేను డిగ్రీని ప్రైవేటుగా చేస్తానన్నాను. మీరు నాకు పుస్తకాలు పంపారు. ఆ పుస్తకాల దొంతరలో మీ డైరీ దొరికింది. మీ కాలేజీ రోజుల గురించి ఏదో మీరు రాసారని అనుకొని చదివాను. అందులో మీరీ రోజు చెప్పిన సాని వీధి సంఘటన ఉంది. ఆ విషయమే మిమ్మల్ని ప్రశ్నిస్తే నిజాయితీగా ఒప్పుకుంటారో లేక నాకు అటువంటివి తెలీదంటూ అబద్ధం చెబుతారో తెలుసుకోవాలని పరీక్ష పెట్టాను. మొదటి రెండు రోజుల్లో మీరు మనస్సాక్షిని మోసగించి నన్నెక్కడ మాయ చేస్తారోనని తెగ నలిగిపోయాను. అయితే మీరీనాడు నాకు తెలీదంటూ తప్పించుకోవటానికి ప్రయత్నించ లేదు. అంతే కాక... మీ మనసుకి ప్రతిబింబమైన డైరీలో రాసుకున్నదంతా నాకు చెప్పారు. మీ గుండెల్లో నిజాయితీని నా ఎదుట పరిచారు. ఏ భార్య అయినా తన భర్త చేసే చెడ్డకంటే దాన్ని కప్పిపుచ్చుకోవటానికి అతను వేసే వెధవ వేషాలనే అసహ్యించు కుంటుంది. ఆ పని మీరు చేయలేదు... అందుకే మీరు నాకు నచ్చారు..'' అంటూ బాహువుల్లో ఒదిగిపోయింది.

ఆ క్షణం దాకా గుంజాటనలో నలిగిపోయిన బాలు హృదయం దూది పింజల్లే తేలిపోయింది.

ఆ రాత్రంతా ఎన్నెన్నో మధురిమలు వారిద్దరి నడుమ ఉయ్యాలలూగాయి,

మర్నాడు సుష్మ తన ప్రియమిత్రురాలు భామినితో భర్త గొప్ప వ్యక్తిత్వంతో పాటు శృంగార చేష్టలు కూడా విప్పిచెప్పింది.

★




చిరునామా :
కె.కె.రఘునందన, రామతీర్థం పోస్టు,
విజయనగరం జిల్లా - 535 218
సెల్: 9440295072